# కాంతమ్మగారి ఆవు

"పాలకనీ పెరుక్కనీ నెలకు పది పన్నెండు రూపాయలు ఖర్చు కావటమే కాని, ఏం లాభం లేదండీ పిల్లలు పెరుగు కోసమని పూట పూటా ఏడ్వటమే." అన్నది. మా ఆవిడ ఓ రోజున -

"అయితే...నన్నేమి చేయమంటావమ్మా-?"

"ఈ డబ్బు పెడితే మనమోపాడి గొడ్డును పెట్టుకోవచ్చు. అదీ నేననటం" "ఆ పోనిద్దూ, అది కూడా ఎందుకు అదో బరువూ!" "ఆ, అదేం మాటండీ? పసిబిడ్డా పాడికుండా అన్నారు. పాడిగొడ్డు మహలక్ష్మి కాదుటండీ!"

మహలక్ష్మే కాని...రొచ్చు మహాలక్ష్మి...అదీగాక వున్న మహలక్ష్మికే చాకిరీ చేయలేకుండా ఉన్నాను, ఇంకో దాన్ని భరించగలనా?"

"అబ్బో, మీశక్తి మీకు తెలియదుగాని, ఎంతమందినైనా భరించగలరు" అని నవ్వింది, ఆవిడ, "సరేలే ఊరుకో" అన్నాను నేను. మా ఆవిడ ఊరుకోలేదు. పాడిగొడ్డును ఒక దానిని కొంటే పెరుగూ పాలూ సమృద్ధిగా వాడుకోవచ్చుననీ, మాంచికమ్మని నెయ్యి వేసుకోవచ్చునని, దాని వలనమాకేమీ ఎక్కువ కర్చు లేదనీ మా ఆవిడ నాకు నచ్చ జెప్పింది.

"అయితే గేదెను మటుకు నేను కొనను. అది రొచ్చు చేస్తుంది. దానికిచచ్చేంత చాకిరీ - చేయాలె," అన్నాను నేను.

"పోనీండి, మీకంత ఇష్టంలేకపోతే అవునే కొనండి. నేనొద్దు అన్నానా? ఏదో ఒకటీ. కాకపోతే కాస్త నెయ్యి తక్కువ అవుతుంది. అయితే అయింది. దాని వార పాలల్లో మనకు లాభిస్తుంది. ఆవుపాలు తాగితే పిల్లలకు బలం కూడానూ, అని దీర్ఘాలు తీస్తూ మాఆవిడ ఒక్క తీరానపోరింది."

"ఆ రాత్రి కొంచెం తీవ్రంగానే ఆలోచించాను ఆవును కొనటమా, మానటమా" అనీ, ఆవు గోమహలక్ష్మి కదా. శుభప్రదమైన సంగతి ఆవుపాలు పిల్లలకిస్తే బలమూ

సరే ఎట్లాగూ పెరుక్కూ పాలకూ పదిరూపాయిలు అవుతునే ఉన్నయి. ఆ ఖర్చుతో ఆవును మేపవచ్చు. గృహస్తు అయిన వాడికి పాడీ పంటా వుండాలన్నారు. ఇదీ బాగానే ఉంది. అని ఆలోచించి చివరకు సరేననుకొన్నాను.

"అట్లాగ చేస్తేనే బాగుంటుంది" అన్నాను కాంతంతో. ఆమె చాలా సంతోషించింది. ఆరాత్రి పిల్లలు మళ్ళీ పెరుగుకోసం ఏడ్చినపుడు – ఓరేయి నాయినా మీనాయిన రేపు ఆవును కొనబోతున్నారు. ఇక మీకు కావలసినంత పెరుగూ తాగినన్నీ పాలూనూ" అంది. "అమ్మా; ఆవుకు తువ్వాయి ఉందా" అని అడిగింది పసిది. "తువ్వాయి లేకపోతే ఆవు పాలెల్లా ఇస్తుందే" అన్నది వాళ్ళమ్మ. "తువ్వాయితో నేను ఆడుకొంటానే" అని జయ తన నిశ్చయాన్ని వెలిపుచ్చింది.

"పాలు నేను తీస్తానే అమ్మా" అని చినపిల్ల సుశీ అన్నది. "నీవా ఆవుపాలు తీసేది – ఆ తీసినట్లే! ఆ ఆవు ఒక్కపోటు పొడుస్తుంది తెలుసునా? అసలు ఆడవాళ్ళు పాలుతీయరు. నేను తీస్తాను" అన్నాడు మా అబ్బాయి ఛాతీ విరిచి.

"నిన్ను మటుకు పొడవదా ఏమిట్రా మహా పెద్ద మొనగాడిలాగ మాట్లాడుతావు" అని అంటూ ముక్కుపుటాలు ఎగరేసింది సుశీ.

"నన్ను అసలు ఆవు పొడవరాదు. ఒకవేళ పొడవొచ్చినా దాన్ని నేను స్వాధీనం చేసుకోగలను" అని మా అబ్బాయి అన్నాడు ఉరిమి చూస్తూ.

"అన్నీ ఏడ్చావులే" అన్నది సుసీ.

"తంతానేవ్" అన్నాడు ఈ చిన్నివెధవ అన్నందగ్గర నుంచి ఎంగిలి చేత్తో లేస్తూ.

"ఆవును కొననూ లేదు, పెట్టనూ లేదు ఈ చిన్ని సన్యాసులు అప్పుడే పోట్లాడుకొంటున్నారు. చూశారా" అంటు వాడ్ని కూర్చొబెట్టింది తల్లి.

ఆ భోజనాలైన తరువాత ఆవుకు పాక ఎక్కడ వేయాలిసింది, గడ్డివామి ఎక్కడ పెట్టాలిసింది. మొదలైన విషయాలన్నీ చర్చించుకొంటూ చాలాసేపు మాట్లాడుకొని నిద్రపోయాము. ఆ రోజు తెల్లవారుఝామున ఆవిడనన్ను లేపి – "శనిఉషస్సులో బయలుదేరి వెళ్ళటం, చాల మంచిది. బయలుదేరండి, సుళ్ళుగిళ్ళూ

ఉంటవి. మీకు తెలియవు, రామరాజుగారిని కూడా వెంటబెట్టుకెళ్ళండి సంతకు" అని చెప్పి అయిదు పదిరూపాయలనోట్లూ, పదిరూపాయలరొఖంచేతిలో పెట్టి జాగ్రత్తసుమండీ అని చెప్పింది మా ఆవిడ.

ఆ రోజు మధ్యాహ్నం ఒంటిగంట అయింది. ఆవును ఇంటికి తోలుకొని వచ్చేసరికి, ఆవును జూచి మా యింటి ఆవిడ చాలా సంతోషించింది. దాన్ని చూస్తేనే కడుపు నిండేటట్లుంది. దృఢంగా ఉంది. పెద్దపొదుగు నేను చూస్తూ ఉండగానే వాడు రెండు శేర్లపాలూ తీశాడు. ఖరీదైనా అట్టే పెట్టలేదు. యాభై రూపాయలకే కొన్నాను. ఈ విషయాలన్నీ తెలిసికొని మా ఆవిడ ఉప్పొంగిపోయింది. ఆవును దొడ్డొ కట్టేసుకొని దాన్ని చుట్టూ చేరి చూసి ఆనందించాము. దానికి మేత నీళ్ళు చూసేందుకు ఒక నౌకరినీ కూడా పెట్టాము.

అన్నీ విధాల బాగానే ఉంది కాని, దానికి కొంచెం కోపం ఏక్కువ. పాలు తీయటానికి దగ్గరకు వెడితేమట్టుకు బుస్సుమంటుంది. పొడవస్తుంది. మొదటిరోజున పాలుతీయలేక దూడకే వదిలేశాము. రెండోరోజున అంతే అయింది. దూడకుపాలు ఎక్కువై జబ్బు చేసింది. దానికి చికిత్స చేయించాము. ఆవుకు పాలుతీయటమనేది ఒక పెద్దసమస్య అయిపోయింది.

"మూతిని తాడుతో కట్టేసి, నాలుగు కాళ్ళకు బంధం వేసి క్రింద పడేసి, అప్పుడు పాలుతీస్తే ఏం జేస్తుంది నాన్నా" అన్నది మా పెద్దపిల్ల.

ఎద్దులకూ గుఱ్ఱాలకూ, గిట్టలకు నాళాలు కొట్టే సమయంలో, దాన్ని పడేశే పద్ధతిలో మా ఆవును కూడా పడేయాలెనన్నమాట. అదే సరియైన పద్ధతీ అని తోచింది. ఇంకోవిధంగా మాకు అది స్వాధీనమైయ్యేట్లు లేదు. కాని అల్లాగ పడేయటానికి ఇద్దరు ముగ్గురు మనుష్యుల సాయం కావాలె. అదీగాక అల్లాగజేస్తే అది పాలు ఎగజేపుతుందని రామరాజుగారు చెప్పారు. ఇక మాకు ఏమి ఉపాయం తోచింది కాదు. ఏమిటా భగవంతుడా అని అనుకొన్నాము. ఎంత తంటాలు పడ్డా అది పొడవరావటం మానటంలేదు. రామరాజుగారూ నేనూ; కర్రలు పుచ్చుకొని యమకింకరులలాగ దాని కట్టెదుటనుంచోటమూనూ, మా ఆవిడ పాలు తీయటమూను ఇదీవరస.

ఎన్నాళని ఇల్లాగ తంటాలు పడగలము. కాని ఏం జేస్తాము? అట్లాగే గడుస్తున్నది. కాని దాని కడుపు చల్లగా అది రెండు శేర్లపాలూ ఇస్తున్నది. నెయ్యి కూడా అవుతున్నది. అందుకు దాన్ని వదలలేక ఇల్లాగే ఇద్దరు ముగ్గురు కఱ్ఱలతో దాని ముందునుంచునే వాళ్ళము గదాయుధాలను చేతపూని.

అప్పటికి ఆవును కొని నెలరోజులైనా దాన్ని ఇంట్లోనే కట్టేసి మేపాముగాని, బీడుకు తోలలేదు. గొడ్ల కాసేవాడు ఒక రోజున దాన్ని తోలుకెళ్ళాడు. ఎప్పుడూ కట్టేసి ఉంచితే దానికి జబ్బు చేస్తుందన్నారు. అందుకని వదిలాము. సాయంత్రం అందిరిగొడ్లూ ఇళ్ళకు చేరినై ఇది రాలేదు. ఆ వెధవనడిగితే అది పారిపోయిందండీ బాబూ అన్నాడు.

ఎట్లా ఊరుకోము. రెండురోజులు సెలవు పెట్టి రామరాజుగారు నేనూ వెళ్ళి చుట్టుప్రక్కల ఊళ్ళు అన్నీ తిరిగి వెదికి దాన్ని పట్టుకొచ్చాం. ఎందుకొచ్చిన అవస్థారాఇదీ అనిపించింది. మాటిమాటికి అది అల్లాగ వెడుతుంటే మాగతి ఏం కావాలా అని అనిపించింది.

మర్నాడు నేను సాయంత్రం ఇంటికొచ్చేసరికి, దాని మెళ్ళో ఒక సిల్కు తాడు. దాని నుండి వ్రేలాడుతున్న ఒక పెద్ద అట్టముక్క కనిపించినవి. "ఈ ఆవు ము॥ వెంకట్రావు గారిది బుట్టయ్యపేట, మచిలీపట్నం - అని దానిపై వ్రాసి ఉంది. రామరాజుగారిచేత మా అబ్బాయి, ఆ అట్టముక్కను దాని మెళ్ళో కట్టించాడట. ఎందుకురా అంటే ఎప్పుడైనా అదిపోకిరీగా లేచిపోయినా, ఆ అట్టముక్కపైనున్న అడ్రసు ప్రకారం మళ్ళీ ఇంటికొస్తుందట! సరే బాగానే ఉందీ అనుకొన్నాము.

నేనే దానిని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నం చేయసాగాను. దువ్వటం మొదలుపెట్టాను. గంగడోలు గోకి దాన్నిమంచి చేసుకోవాలెనని చూశాను. ఎన్ని జేసినా ఊరుకొనేదేగాని పొదుగు దగ్గరకు వెళ్ళేసరికి బుస్సుమనేది "ఏమండీ ఏమైనా స్వాధీనానికివస్తుందా" అన్నది మా ఆవిడ ఒకరోజున. "లేదు కాంతం" అన్నాను. "దువ్వండి దువ్వి స్వాధీనం చేసుకోండి, మీరుమగవాళ్ళు ఎట్లాగయినా మీరే స్వాధీనం చేసుకోవాలె" అన్నది ఆవిడగారు. "ఈఆవు అంతా నీమోస్తరేనే కాంతం ఎంత దువ్వినా లొంగటం లేదు. అన్నాను. "అల్లాగా, దువ్వేతీరునదువ్వితే అదే లొంగుతుంది

చేత కాక పోతే" సరి అన్నది ఆవిడ ఈసడింపుగా, కాని ఎంత దువ్వినా ఆ ఆవు మటుకు మాకు లొంగిందికాదు.

రోజూ అదేవిధంగా పాలుతీసే సమయానికి నేనూ రాజుగారూ పిల్లలూ అంతా, కర్రలుపుచ్చుకొని దానిముందు నిలబడేవాళ్ళం. ఆవిడ ఎల్లాగో కష్టపడి పాలుతీస్తున్నంతసేపూ నా ప్రాణాలు అరచేతిలో ఉండేవి. ఎక్కడపొడుస్తుందో ఎక్కడ తగలరాని చోట దెబ్బ తగులుతుందో అని భయం. ఒకరోజు మాటకాదాయె ఇది! నిత్యం ఇంటిల్లి పాదీ సర్కసులో వాళ్ళలాగ తయారు కావాలాయె! చివరకు విసుకెత్తి నేను అన్నాను మాఆవిడతో – "కాంతం – ఈ ఆవును అమ్మేసి అయిన కాడికి సొమ్ము చేసుకొందామూ అని" కాంతం ముఖం ఇంతజేసుకొని రుసరుసలాడుతూ అన్నది. "పాడిగొడ్డును అమ్ముకొంటారా ఏమిటండీ" అని. "అయితే ఈ పోట్లగొడ్డును పెట్టుకోని ఎన్నాళ్ళనీ....కాపరం చేయటం" అన్నాను నేను చీకాగ్గా "ఎన్నాళ్లైనానూ, ఏం? ఎన్నాళ్లైనా కాపరం చెయ్యెచ్చునండీ?" అని దీర్ఘాలు తీసింది ఆవిడగారు.

"అయితే ఈ పోట్లగొడ్డుతోనా" అని నేను రెట్టించాను.

అయితేనేమండీ, నేను మిమ్మును పెట్టుకు కాపరం చేయటంలా? అన్నది కాంతం. విదిలించినట్లు.

"నేను............కూడా.......పోట్లగొడ్డునే అంటావా? నువ్వు చెప్పినట్టల్లా వింటున్నాను. నిన్నేమన్నా కొడుతున్నానా? తిడుతున్నానా? పల్లెత్తుమాట నిన్ను అంటంలేదూ" అన్నాను నేను విచారంగా "ఇప్పుడూ అదంతా ఎందుకు మీరు మటుకు మొదట్లో ఒక్కతీరాన స్వాధీనమైనారా! ఇంతకంటే ఎక్కువగానే బుసలు కొట్టారు మొదట్లో, ఇంతకంటే బాగానే ఎక్కువ పొడవొచ్చారు! ఏమిటో! మొదట్లో అందరూ అంతే అల్లాగే ఓపిక పడితే ఎంత పోట్లగొడ్డు అయినా స్వాధీనానికి రాకమానదు. అమ్ము కుంటారటండీ!!" అన్నది మా గృహిణి కాంతయ్యమ్మారావు బేగం ఆ నిండిన పాలచెంబు చెత్తోపట్టుకొని చీర కుచ్చెళ్ళు జీరాడుకొంటూ ఇంట్లోకి పోతూ, పోతూ పోతూ వెనక్కు తిరిగి నన్ను జూచి ఒక చిరునవ్వు నవ్వింది, నేను మా ఆవు వంక చూశాను మాఆవు నావంక జూసింది, ఇంతింతకళ్ళతో–దీనంగా.